క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: గ్రీన్‌పార్క్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-1 ఈఈ(ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎన్‌జీజీవోస్ కాలనీ, శాంతిపురం, పద్మశ్రీ హాస్పిటల్ ఏరియా, సచివాలయం, కిన్నెర మెస్ ఏరియా, మసీదు ఏరియా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వనితా భవన్‌లో శనివారం ఉదయం 9 గంటలకు మహిళలకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా సంబంధిత వ్యాధులతోపాటు బ్రెస్ట్ స్క్రీనింగ్, పాప్‌స్మియర్ పరీక్షలు చేస్తారన్నారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు శనివారం నేరుగా వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చని చెప్పారు. వైద్య పరీక్షలకు ఆధార్ కార్డు తీసుకుని రావాలన్నారు. వివరాలకు 92992 04202 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైల్వే ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్ ప్రారంభం



డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, జ్యోత్స్న బోహ్రా

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని వాల్తేర్ డివిజన్ రైల్వే హాస్పిటల్‌లో నూతన డయాలసిస్ యూనిట్‌ను శుక్రవారం డీఆర్‌ఎం లలిత్ బోహ్రా, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ జ్యోత్స్న బోహ్రాతో కలిసి ప్రారంభించారు. ఈ యూనిట్‌ను ఎస్‌ఏపీ మెడికల్స్ హైదరాబాద్ సహకారంతో ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సదుపాయం ద్వారా రైల్వే ఉద్యోగులు, వారి భాగస్వాములు, కుటుంబ సభ్యులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, ఇతర అధికారులు, రైల్వే హాస్పిటల్ వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి మాలధారులకు నిత్యాన్నదానం

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి డిసెంబర్ 5 వరకు వివిధ మాలధారులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని సంఘ అధ్యక్షుడు ఆడారి సత్యనారాయణ తెలిపారు. కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం వద్ద ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. 9 ఏళ్ల కిందట ప్రారంభించిన నిత్యాన్నదానాన్ని ప్రతి ఏటా కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. దాతల సాయంతో 41 రోజుల పాటు భిక్ష కొనసాగుతుందని చెప్పారు. మాలధారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వర్ణకార సంఘం ప్రమాణ స్వీకారం



ఐక్యత చాటుతున్న స్వర్ణకార సంఘం ప్రతినిధులు

దాబాగార్డెన్స్: స్వర్ణకార సంఘ నూతన కార్యవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. పాతనగరం టౌన్ హాల్ వద్ద ఉన్న విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి, కామాక్షి మాత చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ నూతనంగా ఎన్నుకున్న సంఘ అధ్యక్షుడు కర్రి త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి పాటోజు రామకృష్ణ నాని, కోశాధికారి కర్రి రాజశేఖర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ గోడి నరసింహాచారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, సంఘం ప్రతినిధులు మారోజు ఆచారి, డొంక నానాజీ, గుంటుపల్లి ప్రసాద్, శివకోటి శ్రీనివాసరావు, గిడిజాల పార్వతీశం, కర్రి వెంకటేశ్వరరావు, బంగారు సురేష్, గురజాపు రవి, పండూరు శేఖర్, కర్రి విశ్వం, ధర్మవరపు వరం బాబు, పోలవరపు శ్రీను, పాటోజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల తిష్ట





వరాహగిరి కాలనీ కొండవాలు ప్రాంతంలో అధ్వానంగా రోడ్లు



వరాహగిరి కాలనీ-1లో శిథిలమైన కాలువ

- 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో దారుణ దారులు.. శిథిల డ్రైనేజీలు
- అభివృద్ధి పనులకు నోచుకోని వైనం
- ఇబ్బందులు పడుతున్న నివాసులు
- పట్టించుకోని ఎమ్మెల్యే, అధికారులు



సత్యసాయినగర్‌లో దారుణంగా ప్రధాన రహదారి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు తిష్ట వేశాయి. ఇక్కడి సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ-1, 2, సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం కాలనీలు భీమిలి నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. ఈ కాలనీల పరిస్థితిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పట్టించుకోవడం మానేశారు. ముఖ్యంగా వరాహగిరి కాలనీ-1, 2ల్లో సరైన రహదారులు, డ్రైనేజీలు లేవు. దశాబ్ద కాలం కిందట నిర్మించిన రోడ్లు, మెట్ల మార్గాలు కావడంతో ఇవన్నీ శిథిలమై దారుణంగా తయారయ్యాయి. వరాహగిరి కాలనీ-1, 2ల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి కాలువలు దెబ్బతిన్నాయి. దోమల వ్యాప్తితో కొండవాలు నివాసులకు తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే పిల్లలు, వృద్ధులు ఏమాత్రం అజాగ్రత్తగా.. ఉన్నా రోడ్డు పక్కనే ఉన్న శిథిల డ్రైనేజీల్లో పడాల్సిన పరిస్థితి నెలకొంది.

మా సమస్యలు పరిష్కరించండి మహాప్రభో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సత్యసాయినగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు, వాటిపై కప్పులు వేసి పలు అభివృద్ధి పనులు చేపట్టి, పూర్తి చేశారు. గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో కొండవాలు ప్రాంతాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు. కనీసం శంకుస్థాపన కూడా చేయలేదు. భీమిలి నియోజకవర్గ పరిధిలోని తమ ప్రాంతాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పూర్తిగా మరిచిపోయారని, సమస్యలను పట్టించుకోవడం లేదని కొండవాలు నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి.. ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు చేయించాలని కోరుతున్నారు.

రోడ్లు బాగు చేయండి

మా ప్రాంతంలో రోడ్ల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. చాలా కాలంగా ఇలానే ఉన్నాయి. గతంలో సత్యసాయినగర్‌లో అక్కడక్కడా రోడ్లు నిర్మించారు. మా ప్రాంతంలో కూడా రోడ్లు వేస్తామని చెప్పి ఇప్పటివరకు వేయలేదు. కొండవాలులో అధ్వాన దారులపై రాకపోకలు సాగించేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.

– రమ, వరాహగిరి కాలనీ

కాలువలు శిథిలమయ్యాయి

వరాహగిరి కాలనీ-1లోని ప్రతి వీధిలోనూ కాలువలు శిథిలమయ్యాయి. వీటిని నిర్మించి దాదాపు పదేళ్లవుతున్నా.. నేటికీ ఇలానే వదిలేశారు. పాడైన డ్రైనేజీలకు మరమ్మతులు లేవు. కొత్తవి నిర్మించలేదు. మా ప్రాంతంలో ఎక్కడికక్కడ డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో దోమలు వ్యాపించి రోగాల బారిన పడేస్తున్నాయి.

– సూకరాజు, వరాహగిరి కాలనీ

అధికారులు చర్యలు చేపట్టాలి

గత ప్రభుత్వంలో సత్యసాయినగర్‌లో అక్కడక్కడా రోడ్లు నిర్మించారు. ప్రస్తుతం మా ప్రాంతంలో కొన్ని చోట్ల రోడ్లపై రాళ్లు తేలాయి. మరికొన్ని చోట్ల రోడ్లు దెబ్బతిని నీరు నిల్వ ఉండిపోతోంది. దీనివల్ల నాచు పట్టి, దోమలు వృద్ధి చెందుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కొండవాలు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– బి.అప్పారావు, సత్యసాయినగర్

అలరించిన గాత్ర సంగీత వాద్య కచేరీ



జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభిస్తున్న కొణతాల రాజు, రాజశేఖర్

సీతంపేట: మెలోడీ క్రియేటర్స్ సంస్థ 25వ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన గాత్ర సంగీత వాద్య కచేరీ అలరించింది. కళాశాల సంస్థల ప్రతినిధి కొణతాల రాజు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బి.కామేశ్వరశర్మ వయోలిన్‌తో సంకీర్తనలు పలికించి, గాత్ర ధారణ చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వీరికి మృదంగంపై ఎ.కౌండిన్య, తబలాపై బి.రమణమూర్తి, ఆర్గాన్‌పై సోమేష్ వాద్య సహకారం అందించారు. నవచైతన్య జానపద కళాకారుల చిన్న రెడ్డి బృందం జానపద గీతాలు ఆలపించి చక్కని నృత్యం చేశారు. మెలోడీ క్రియేటర్స్ 25వ వార్షికోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరినీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, వి.ప్రభాకర్, ఎం.ఎస్.మాధవ్, కె.వెంకట సురేష్, ఎస్.నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి విశిష్టతపై కవి సమ్మేళనం



ప్రసంగిస్తున్న డాక్టర్ సూర్యారావు

సీతంపేట: విశాఖ సాహితి ఆధ్వర్యంలో శుక్రవారం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో దీపావళి విశిష్టతపై కవి సమ్మేళనం జరిగింది. విశాఖ సాహితి ఉపాధ్యక్షురాలు డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి అధ్యక్షత వహించారు. దీపావళి పండగ ప్రశస్తిని వివరించారు. కవి సమ్మేళనం నిర్వాహకుల డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ మనలోని అజ్ఞానమనే చీకటిని పారదోలి.. జ్ఞానమనే వెలుగుకు ప్రతీకగా దీపావళి పర్వదినాన్ని జరుపుకుంటామని చెప్పారు. కవితా గోష్ఠికి విశాఖ సాహితి కార్యదర్శి శంకర్‌నీలు స్వాగతం పలికారు. కవులు భాగవతుల సత్యనారాయణమూర్తి, పిల్లా రమణమూర్తి, బి.రాధారాణి, కె.వి.రామారావు, ఎ.ప్రసాద్, పరమేశ్వరరావు తమ కవితలతో అలరించారు.

ఉత్సాహంగా ‘మ్యాథ్ మ్యాట్రిక్స్ 2కే25’



మ్యాథ్ మ్యాట్రిక్స్ ఈవెంట్‌లో అతిథులు, అధ్యాపకులు, విద్యార్థులు

కంచరపాలెం: విద్యార్థుల్లో మేధా కౌశలం, అంతర్గత ప్రతిభా పాటవాలను ప్రోత్సహించేందుకు అంతర్ కళాశాలల గణిత పోటీలు ఎంతో దోహదపడతాయని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ అన్నారు. గణిత విభాగం, గణాంక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మ్యాథ్ మ్యాట్రిక్స్-2025 ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సమగ్ర విద్య లెక్చరర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, ద్వితీయ భాషల పూర్వాధిపతి డాక్టర్ పి.కె.జె.లక్ష్మి, ఏయూ గణిత ఆచార్య శర్మ మాట్లాడారు. నగరంలోని పలు కళాశాలల నుంచి 80 మంది విద్యార్థులు క్విజ్, సుడోకో, మైండ్ మేస్, అర్థం మోజిష్, థింక్ ట్యాంక్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కెప్టెన్ కె.సుజాత, కె.కె.సౌజన్య, జి.యోజన, లక్ష్మి, ఎస్.శ్రీరామ్, గౌరీశంకరరావు, సునీత చౌదరి, వి.భారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

విరిగి వేలాడుతున్న చెట్టు కొమ్మ



సీతంపేట అపూర్వ ఆస్పత్రి వద్ద రోడ్డుపైకి వేలాడుతున్న చెట్టు కొమ్మ

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలోని అపూర్వ ఆస్పత్రి ఎదురుగా చెట్టు కొమ్మ విరిగి రోడ్డుపైకి వేలాడుతోంది. మార్గంలో అడ్డంగా కొమ్మ ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. అటువైపు ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలలు ఉండటంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అధికారులు స్పందించి చెట్టు కొమ్మను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



సైబర్ క్రైంపై అవగాహన కల్పిస్తున్న సీఐ బాబు

కంచరపాలెం: సమాజంలో సైబర్ నేరాలు విస్తృతంగా పెరుగుతున్నందున యువత జాగ్రత్తగా ఉండాలని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు పేర్కొన్నారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. యువత తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురి కాకుండా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. శక్తి యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు 9440796019 నంబర్‌కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, ఇన్‌చార్జి డాక్టర్ సుజాత, కృష్ణకుమారి, పి.కె.జయలక్ష్మి, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

దాబాగార్డెన్స్: విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పట్టారు. విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, మీటర్ రీడర్లకు, స్టోర్ హమాలీలకు పీస్‌రేట్ రద్దు చేసి నెలవారీ జీతాలు చెల్లించాలని, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఏటీపీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు కనీస వేతనాలు చెల్లించాలని, జేఎల్‌ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేసి పదోన్నతులు కల్పించాలనే డిమాండ్లతో కొన్నేళ్లుగా ప్రభుత్వానికి, యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేసినా.. సమస్యలు పరిష్కరించకపోవడంతో సమ్మెకు దిగారు. ఈమేరకు శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో ఈపీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయం (సర్కిల్ ఆఫీస్) వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ నాయకులు మాట్లాడుతూ పవర్ జేఏసీ చేస్తున్న పోరాటాలకు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు అవతారం, స్టోర్స్ హమాలీస్ నాయకుడు శ్రీనివాస్, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

రహదారి గోతులమయం



బుల్లయ్య కళాశాల వద్ద ఛిద్రమైన రహదారి

సీతంపేట: స్థానిక బుల్లయ్య కళాశాల ముందున్న రహదారి ఛిద్రమైంది. రోడ్డంతా గోతులతో నిండి, తారుపోయి దారుణంగా తయారైంది. సత్యం జంక్షన్ నుంచి రామాటాకీస్ కూడలికి నిత్యం ఎంతో మంది వాహనాలపై ప్రయాణిస్తుంటారు. గతుకుల రోడ్డుపై వాహనాలు జారి పడి ప్రమాదాల పాలవుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపైన గోతులు సరిగా కనిపించకపోవడంతో వాహన చోదకులు జారి పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిలో గోతులు పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సందడిగా మండల స్థాయి ఆటల పోటీలు



బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రావణి



మాట్లాడుతున్న ఎన్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్ హెచ్‌ఎం రాధాకుమారి

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయి ఆటల పోటీలు హెచ్‌ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. జిల్లా ఉప విద్యాశాఖాధికారి సోమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, వార్డు అధ్యక్షుడు ముక్క కిషోర్‌కుమార్, హెచ్‌ఎం రాధాకుమారి, ఎంఈవోలు రామారావు, బాలామణి వ్యాయామ ఉపాధ్యాయులు రత్నం, జ్యోతి బెలూన్లు ఎగురవేసి పోటీలు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వాలీబాల్, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, శ్యామల, రామలక్ష్మి, అప్పారావు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, కిరణ్, ప్రభాకర్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు.

నేరాల నియంత్రణపై అవగాహన



రైల్వే స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న క్రైం సీఐ చంద్రమౌళి

మర్రిపాలెం: ఇటీవల జరుగుతున్న నేరాలు, చోరీల నేపథ్యంలో కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంచరపాలెం, జ్ఞానాపురం రైల్వే స్టేషన్ వంటి ఎనిమిది ప్రాంతాల్లో ఆటో డ్రైవర్లకు చోరీలు ఎలా జరుగుతాయి, వాటికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్రైం సీఐ చంద్రమౌళి వివరించారు. ఆటో డ్రైవర్లు వారివారి ఆటోలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని, అందరూ ఒకే చోట నిలుపుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చన్నారు. ఆటో టైర్లు, బ్యాటరీల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఆకతాయిల నుంచి ఆటోలు కాపాడుకోవాలని చెప్పారు. నేరాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో క్రైం ఎస్‌ఐ మారూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.


దృఢ సంకల్పంతోనే మెరుగైన ఫలితాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు

మద్దిలపాలెం: విద్యలో రాణించేందుకు దృఢ సంకల్పంతో విద్యార్థులు ముందుకు సాగాలని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. ఏయూలో శుక్రవారం ప్రపంచ సాంఖ్యాకశాస్త్ర దినోత్సవాన్ని ఆంధ్రా యూనివర్సిటీ సాంఖ్యాక శాస్త్ర విభాగాధిపతి, జనాభా పరిశోధన కేంద్రం గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్. బి. మునిస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభ్యాసంలో మెలకువలు, విద్య, ఉద్యోగ సాధనలో ఏం చేయాలో వివరించారు. అలాగే స్టాటిస్టిక్స్ ఎలా ఉపయోగపడుతుందో తెలిపారు. ప్రొఫెసర్ బి. మునిస్వామి మాట్లాడుతూ సాంఖ్యాక శాస్త్ర ఆవశ్యకత, వివిధ అంశాలలో ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఆయా అంశాలు దేశాభివృద్ధి ఏ స్థాయిలో ఉందో తెలియజేస్తాయన్నారు. ఈ స్టాటిస్టిక్స్ ఏ విధమైన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందో వివరించారు. వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు కె. శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

సిరులతల్లికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో రూ.500 రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. పూజకు దంపతులు లేదా ఇద్దరు భక్తులను అనుమతిస్తామని చెప్పారు. ఏఈవో కె.రాజేంద్ర కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు తులసి పూజ

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసి పూజ నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

డంపింగ్ యార్డులా పార్కు స్థలం



రాజేంద్రనగర్ పార్కు స్థలంలో డంప్ చేసిన చెట్ల కొమ్మలు



చెత్త, వ్యర్థాలతో డంపింగ్ యార్డును తలపిస్తున్న పార్కు స్థలం



పార్కు స్థలంలో పడేసిన బడ్డీలు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో అపూర్వ ఆస్పత్రి వద్ద గల రాజేంద్రనగర్ పార్కు స్థలాన్ని డంపింగ్ యార్డుగా మార్చేశారు. దసరా పండగ రోజున గాలివాన బీభత్సానికి వార్డులోని శాంతిపురం, మధురానగర్, సీతంపేట ప్రాంతాల్లో పలు చోట్ల చెట్లు, కొమ్మలు విరిగిపడ్డాయి. చెట్ల కొమ్మలను డంపింగ్ యార్డుకు తరలించకుండా వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రనగర్ పార్కు స్థలంలో డంప్ చేశారు. కొమ్మలు ఎండలకు బాగా ఎండి ఉన్నాయి. రానున్న దీపావళి పండగను పురస్కరించుకుని చుట్టుపక్కల నివాసులు వెలిగించే బాణసంచా ఎండిన కొమ్మలపై పడితే మంటలు చెలరేగే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా చెట్ల కొమ్మలను పార్కు స్థలం నుంచి తరలించాలని కోరుతున్నారు.

చెత్తాచెదారంతో రోత

రాజేంద్రనగర్ పార్కు ఒకవైపు చెట్ల కొమ్మలు.. మరోవైపు బడ్డీలు, చెత్తాచెదారంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. జీవీఎంసీ జోన్-3 పరిధిలో ఎక్కడ బడ్డీలు తొలగించినా.. రాజేంద్రనగర్ పార్కులో పడవేస్తున్నారు. గతంలో ఇక్కడ పడేసిన బడ్డీలు తగలబడటంతో ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను అదుపు చేశారు. మరోపక్క పార్కు స్థలంలో చుట్టుపక్కల నివాసులు చెత్త పడేస్తుండటంతో రోత పుట్టిస్తోంది. అటుగా వెళ్లే వారు చెత్తాచెదారంతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పార్కు స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.